# పశువుల మహాసభ

రచన :
శతతార

ఒకప్పుడది చాలా చిన్నభూమి. ఈ మధ్య ఉన్న పాటున పదింతలయిపోయింది. ఊరి చివర జాగా కాబట్టి ఒక ఫ్యాక్టరీ లేపాలన్న యోచన జరుగకపోలేదు. కాని, అనుకోకుండా చావు రేటు పెరిగిపోయింది. తప్పని సరిగా ఆ భూమి పది ఎకరాల స్మశానభూమిగా మారిపోయింది.

ఆ వల్ల కాటిలో పశువులు సమావేశం అయ్యాయి.

దేశ దేశాల పశువులకోసం పిలుపులు వెళ్లాయి. కాని, కొన్ని కారణాంతరాలవల్ల విదేశీ పశువులు రాలేక పోయాయి. వలసవచ్చి స్థిరపడి పోయిన జర్సీ ఆవులు, ముర్రా గేదెలు అక్కడక్కడ కనపడుతున్నాయి.

ఆ సభకు అధ్యక్షత వహించింది ఆవు.

"పల్లె పశువులు, పట్టణ పశువులు చాలా కాలం తరువాత మొదటిసారిగా కలుసుకున్న ఈ సభ చరిత్రాత్మకమైనది." నాంది పలుకుతూ హర్షం వెలిబుచ్చింది ఆవు.

సభనంతా ఒకసారి కలయచూసి "మనమంతా ఇక్కడ సంఘటితం కావడానికి కారణం ఏమిటి? తోటి పశువు ఉన్నదో ఊడిందో పట్టించుకోని మనం ఏకం కావడానికి పొట్ట బాధే కారణం. ముందుగా విదేశీ పశువులు రాలేక పోయినందుకు వ్రాసిన కారణాలు కొన్ని చదువుదాం" అంది ఆవు.

ఒక లేఖ— "ప్రపంచ పశు మహాసభాధ్యక్షా! గోమాతా! నమో నమః! మాకు కావలసిన పుష్టికరమైన పశుగ్రాసం మీ దేశంలో లభించదు."

మరో ఉత్తరం— "మాలో ఒక పశువుతిండి మీలో పది పశువులు పంచుకోవచ్చు. రానందుకు క్షంతవ్యులం."

"వారం రోజులపాటు కాయితాలు, కలబంద మట్టలు తిని బ్రతకటం మా వల్ల కాదు." ఇది మరో కారణం.

అన్ని వుత్తరాలూ ఇంచు మించు ఇదే ధోరణిలో వున్నాయి.

సభా కార్యక్రమం ప్రకారం ఇప్పుడు జరుగబోయేది "చర్చ".

"తిండి - దానికి పథకం" చర్చనీయాంశం. ఒక తోటపెద్దు ప్రతిపాదన. "చాలాకాలం ఓర్చుకున్నాం. ఇక ఉపేక్షించి లాభంలేదు. మూకుమ్మడిగా ఊళ్లో పడదాం. కనపడ్డ మనిషిని త్రొక్కి పారేద్దాం."

ఒక గోవు "ఆకలిమంట భరించడం కష్టమే. కాని, హింసాకాండ మన జాతికే అవమానకరం. పాలపళ్లూడని పసిపాపల్ని నిర్దాక్షిణ్యంగా నేల రాసెయ్యడం పైశాచిక పంథా. భావితరాలకు మనవల్ల మిగిలేవి సమాధులు. పదికాలాలపాటు పచ్చగడ్డితిని పచ్చగా బ్రతికే మార్గం చూపించండి."

"ఆబోతు ఊరుకోలేదు." మనవల్ల బ్రతికి, మనకి కూడులేకుండా చేయడం దారుణం కాదా? రేయి, పగలు అనకుండా కష్టపడతాం. గొంతెమ్మ కోరికలు కోరం. మనం కోరేది "పాలిష్టర్" బట్టలు కాదు. పట్టెడు గడ్డి, పురికెడునీళ్లూ మన కనీస అవసరాలు, మన ఆసరా కాదని, బస్సులు, రైళ్లు, విమానాలు అంటూ

నేలవిడిచి సాము చేస్తున్నాడు మనిషి. తన సృష్టి నీతిలేని సృష్టి అని తనే పశ్చాత్తాప పడుతున్నాడు. జీవకారుణ్యం నూరిపోస్తూనే మూగజీవులమీద శీతకన్ను వేశాడు. నోరూ, వాయీ లేని పశువులకున్నది దండోపాయం ఒక్కటే.''

''నిదానంగా ఆలోచించండి. పశువు మనిషి మీద విరుచుకుపడటం అనర్ధదాయకం. కయ్యానికి కాలుదువ్వి, మనిషి కలబడితే తొలగిపోలేక నలిగిపోయేది మనమే - చచ్చి సాధించేదేమీ లేదు. అంతా కలిసి ఒక ''మెమోరాండం'' దాఖలు చేసుకొందాం. కష్టజీవి కడుపునిండాలి, నైతిక విలువలు పెరగాలి. మీకోసం శ్రమపడతాం. ఉన్నచోట స్వర్గం సృష్టిస్తాం. ''దీపం దగ్గర చీకటి'' అని హెచ్చరిద్దాం. అంటూన్న అధ్యక్షుని హితబోధతో చర్చ ముగిసింది.

ఆ హితోపదేశం దివ్యంగా వుందని పశువులన్నీ మోరలు చాచి దిక్కులు దద్దరిల్లేలా అరిచాయి.

Phone: 22465

మా తయారింపులు :—

- డాక్టర్, ఏర్‌కూల్,
- గోల్డ్‌విన్, లైఫ్,
- టిప్‌టాప్, విలెట్.

Regd No. 305682

TURKEY KNITTERS
Lakshminagar Tirupur-638 602.

# "విధవ ఆవేదన"

★

నా జీవిత భాగస్వామి,
నా జీవితంలోకి ప్రవేశిస్తూ,
ప్రసాదించిన తాళి మెట్టెలు,
నల్లపూసలు త్యజించాను కదా!
నాకు జన్మతో సిద్ధించిన,
పూలు, బొట్టు. మట్టిగాజులు...
...నా జన్మహక్కులు అనుభవిస్తుంటే,
ఎందుకు వింతగా చూస్తుందీ లోకం?!
సాంప్రదాయిక దురాచారమైన
'అలంకారనిషిద్ధాన్ని' (నా దృష్టిలో)
పాటించ లేనన్న నెపంతో,
వాంఛలు చంపుకోక.
పవిత్రంగా జీవిస్తూ,
భర్త ప్రసాదించిన ప్రతిరూపంలో
జీవితాశని పెంచుకొని,
మనుగడ సాగిస్తున్న నన్ను-
తూలనాడుతుంది ఎందుకు?!
నాకు 'ఆ వాంఛ' వుంటే-
'అలంకారనిషిద్ధం' ఆపగలదా?!

—'జనరంజని'

' కథాంజలి ''లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రం బాధ్యులు కాదు. —సంపాదకుడు.